చాయ్‌కే పరిమితం..!

- శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ క్యాంటీన్‌లో అల్పాహారం బంద్
- టీ, బిస్కెట్లు మాత్రమే అందుబాటులో..
- ఆకలితో ఇబ్బంది పడుతున్న సింగరేణి ఉద్యోగులు


జీఎం కార్యాలయంలోని క్యాంటీన్

శ్రీరాంపూర్: సింగరేణి క్యాంటీన్లు చాయ్, బిస్కెట్లకే దిక్కయ్యాయి. ఒకప్పుడు రకరకాల అల్పాహారాలు, తినుబండారాలతో కళకళలాడగా ప్రస్తుతం అధ్వానంగా మారుతున్నాయి. సింగరేణి కంపెనీ రూ.వేల కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నా, అందులో ఉండే క్యాంటీన్లు మాత్రం ఉద్యోగుల ఆకలిని తీర్చడం లేదు. దీనికి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని క్యాంటీనే నిదర్శనం. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ ద్వారా ఈ క్యాంటీన్‌ను నడుపుతున్నారు. ఇక్కడ వందలాది మంది ఉద్యోగులు పనిచేస్తుండగా క్యాంటీన్‌లో మాత్రం టీ, బిస్కెట్ మాత్రమే లభిస్తున్నాయి. దీంతో షుగర్ ఉన్నవారు, ఇంట్లో ఉదయం వీలుకాక టిఫిన్ చేయకుండా డ్యూటీకి వచ్చినవారు, తినడానికి ఏమీ దొరక్కా ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. గతంలో పాత క్యాంటీన్ ఉన్నప్పుడు కంపెనీ నిర్వహణలో ఉండేది. ఆ సమయంలో ఆర్కే 7గని క్యాంటీన్‌లో ఇడ్లీ, వడ, ఉప్మా తయారు చేయించి ప్రతి రోజు టిఫిన్ సమయానికి ఇక్కడికి తెప్పించి ఉద్యోగులకు పెట్టేవారు. రూ.1కి టీ, టిఫిన్ ప్లేట్‌కు రూ.5 లకే పెట్టేవారు. కానీ తరువాత ఎస్టేట్ కార్యాలయం పక్కకు కొత్తగా క్యాంటీన్ మార్చిన తరువాత పరిస్థితి అధ్వాన్నంగా మారింది. మొదట్లో కొద్ది రోజులు అల్పాహారం పెట్టి, తరువాత బంద్ పెట్టారు.

ఓసీపీ తరహా ఏర్పాటు చేయాలి..

కంపెనీ ఇటీవల అన్ని క్యాంటీన్లను అవుట్ సోర్సింగ్ చేసింది. వీటిల్లో గనులపై ఉండే క్యాంటీన్లలో మాత్రం అల్పాహారం పెడుతున్నారు. ఇక్కడ మాత్రం పెట్టడం లేదు. అన్నింటి కంటే శ్రీరాంపూర్ ఓసీపీలో క్యాంటీన్ నిర్వహణ బాగుందని, అక్కడి మాదిరిగానే ఇక్కడ కూడా క్యాంటీన్ నిర్వహించాలని జీఎం కార్యాలయం ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ ఇడ్లీ, వడ, పూరి, ఉప్మా, పోపన్నం, వెజ్‌బిర్యాణీలు పెడుతున్నారు. దీని నిర్వాహణను అవుట్ సోర్సింగ్ క్రింద కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఉద్యోగులు ఒక ప్లేట్ టిఫిన్ తినాలనుకుంటే రూ.5పెట్టి కంపెనీ కార్యాలయంలో టోకెన్ కొని క్యాంటీన్ కౌంటర్‌లో ఇస్తే టిఫిన్ ఇస్తారు. ప్రతి టోకెన్‌కు కంపెనీ తిరిగి సుమారు రూ.25చొప్పున కంపెనీ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తుంది. దీంతో మంచి టిఫిన్ లభిస్తుంది. ఐతే జీఎం కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ టెండర్‌లో టిఫిన్ ఇండెంట్ తీసేయడంతో ఇక్కడ టిఫిన్లు పెట్టడం లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అల్పాహారం ఏర్పాటు చేయాలి

జీఎం కార్యాలయంలోని క్యాంటీన్‌లో అల్పాహారం ఏర్పాటు చేయాలి. కేవలం చాయ్, బిస్కెట్లు పెట్టడం వల్ల ఉద్యోగులు కొన్ని సమయాల్లో ఆకలితో ఇబ్బంది పడాల్సి వస్తోంది. షుగర్, బీపీ, ఇతర జబ్బులతో బాధపడేవారు నిర్ణీత సమయాల్లో అల్పాహారం తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు క్యాంటీన్‌లో అల్పాహారం ఏర్పాటుకు కృషి చేయాలి.

\- కే. వీరభద్రయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

క్యాంటీన్‌లో అల్పాహారం ఏర్పాటు చేయాలని ఉద్యోగులు రిప్రెజెంటేషన్ చేస్తే ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటాం. అల్పాహారం ఏర్పాటుకు కృషి చేస్తాం.

\- డీజీఎం అరవిందరావు

క్లుప్తంగా

పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరేందర్


నరేందర్

భీమారం: పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భీమారం మండల కేంద్రానికి చెందిన గుడిమల్ల నరేందర్‌ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్ర కమిటీకి జరిగిన ఎన్నికల్లో నరేందర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ డిక్షనరీ డే వేడుకలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ డిక్షనరీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీంరావు మాట్లాడుతూ.. ప్రతిరోజు డిక్షనరీ చూసి పదాలు నేర్చుకోవాలని సూచించారు. భాషకు ప్రాణం పదజాలం అని చెప్పారు. పదజాలం ఎంత ఎక్కువ వస్తే, అంత బాగా భాషపై పట్టుసాధించవచ్చన్నారు. వివిధ డిక్షనరీలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా డిక్షనరీ పదాలు త్వరగా వెతికి పట్టుకునే పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరహాల కరుణాకర్, మురళీధర్, బారిక్‌రావ్, మధుకర్, శ్రీనివాసరావు, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

మంచిర్యాలటౌన్: జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు బుధవారం కేంద్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను హైదరాబాద్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. సీపీఎస్ వ్యవస్థను రద్దు చేసి, పాత పెన్షన్ వ్యవస్థను ఓపీఎస్ అమలు చేయాలని, 317జీవో బాధితుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగులో ఉన్న డీఏలు, పీఆర్సీలను అమలు చేయాలన్న సమస్యలను వివరించారు.

పాఠశాలల సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సురేష్

భీమారం: మండలంలోని అంకుసాపూర్, తాళ్లగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎఈవో సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామాల్లో సర్వే చేసి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించాలని ఎంఈవో ఉపాధ్యాయులను ఆదేశించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి

మంచిర్యాలఅర్బన్: పెండిగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. కళాశాల నిరవధిక బంద్‌లో భాగంగా బుధవారం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సయ్య, చంద్రమోహన్‌గౌడ్, భూమేష్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యూఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు శ్రీకాంత్, సన్నీగౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు


చెక్‌పోస్టులో పోలీసు అధికారులు

కోటపల్లి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నగరా మోగడంతో తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు అప్రమత్తం అయ్యారు. మండలంలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర వంతెనపై ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టులో నిరంతరం తనిఖీలు ఉంటాయని, తెలంగాణ నుంచి మహారాష్ట్ర, మహారాష్ట్ర నుంచి తెలంగాణ మీదుగా వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. సరైన రశీదులు లేకుండా నగదు, వస్తువులు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ సమస్యలకు టోల్‌ఫ్రీ నంబర్



మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని సమస్యలను నేరుగా కార్యాలయానికి ఫోన్ ద్వారా చెప్పుకునేందుకు గాను టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 80088 02683 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఉదయం 10 నుంచి 5 గంటల వరకు మున్సిపల్ సమస్యలు ఏవైనా ఫోన్ చేసి చెప్పవచ్చని తెలిపారు. నేరుగా మున్సిపల్ చైర్మన్‌ను కలిసి సమస్యలు చెప్పుకునేందుకు గాను మీట్ ది యువర్ చైర్మన్ కార్యక్రమాన్ని నెలలో మొదటి మంగళవారం ఉదయం 11 నుంచి 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాను ముందుంటానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. హెటిరో సంస్థ, రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎథిక్ అకాడమీ స్కూల్ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో కంపెనీ ప్రతినిధులు హాజరై పరీక్ష ద్వారా 14మందిని ఉద్యోగానికి ఎంపిక చేయగా, హెటిరో సంస్థ ఉద్యోగంతో పాటు, ఉచిత డిగ్రీ విద్య, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. నేటి యువత ఉన్నత చదువులతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని రఘునాథ్ తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న రఘునాథ్

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో బ్యాడ్మింటన్ సాధన చేస్తున్న వారిని బుధవారం కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఓటు నమోదుకు తమ కార్యాలయం 91606 03222 నంబరులో సంప్రదిస్తే తామే ఓటు నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొలిశెట్టి అశ్విన్, బియ్యాల సతీశ్‌రావు, బింగి ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రించాలి

రామకృష్ణాపూర్: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న పలు షాపులకు జరిమానాలు విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఈఈ సంతోష్, వార్డు ఆఫీసర్ నరేందర్, నాగరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమిని: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. భీమిని మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. కేస్లాపూర్, చిన్నగుడిపేట గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ గంగక్క, నాయకులు లక్ష్మణ్, తిరుపతి, దామోదర్ గౌడ్, పుల్లం తిరుపతి, లక్ష్మీనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

రెండు రోజుల్లో రెండు ఎడ్లు మృతి

- పట్టించుకోని అధికారులు

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట గ్రామంలో రెండు రోజుల్లో రెండు ఎడ్లు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. లింగన్నపేట గ్రామానికి చెందిన బోరగళ్ల సమ్మయ్య ఎద్దు మంగళవారం, బోరగళ్ల రమేశ్‌కు చెందిన ఎద్దు బుధవారం ఆకస్మికంగా మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. రమేశ్‌కు చెందిన ఎద్దు కొనఊపిరితో ఉండగా పశువైద్యాధికారిణి(గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి) అరుణకు సమాచారం ఇవ్వడంతో ప్రైవేట్ వ్యక్తిని పంపించి అరకొర వైద్యం అందించారు. దీంతో ఎద్దు చనిపోయిందని బాధితులు పేర్కొన్నారు. ఎద్దు చనిపోయిందని చెప్పినప్పుడు కూడా కనీసం వచ్చి చూడలేదని బాధితులు ఆరోపించారు. కనీసం గ్రామానికి వచ్చి ఉంటే మా ఎద్దు బతికి ఉండేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎద్దుల విలువ సుమారు 90వేల వరకు ఉంటుందని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై పశువైద్యాధికారిణి అరుణని 'సాక్షి' సంప్రదించగా ఎడ్లు ఏదైనా విషపదార్థం తిని ఉండవచ్చని తెలిపారు. సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి సిబ్బందిని పంపి చికిత్స అందించినట్లు తెలిపారు.

శబరిమలకు పాదయాత్ర

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కాలనీకి చెందిన అయ్యప్పస్వాములు ఖమ్మం ఐలయ్య, బోడ రామకృష్ణ ఇక్కడి నుంచి శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. శ్రీరాంపూర్ కాలనీలోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం పూజలు చేసి పాదయాత్ర మొదలు పెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి నరహరి శర్మ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఏబీఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రాజేశం, ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాదు వీరభద్రస్వామితో పాటు సిరిపురం రాజేశం, మల్లెత్తుల రాజేంద్రపాణి, శ్రీనివాస్, సంకటపల్లి రాజేందర్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్ర ప్రారంభిస్తున్న స్వాములు

నిందితులను పట్టుకోవాలని వినతి

చెన్నూర్: శనిగకుంట మత్తడి కూల్చివేత కేసులో అసలైన దోషులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ అన్నారు. శనిగకుంట కేసు విషయంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి నిజానిజాలు బయటికి తీసుకొచ్చి అసలైన దోషులను పట్టుకోవాలని కోరుతూ రామగుండం సీపీ వెంకటేశ్వర్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌లకు వినతి పత్రాలు అందజేశారు. పోలీసులు మత్తడి కూల్చివేత కేసును సమగ్ర విచారణ జరిపి నిజమైన నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్లు దోమకొండ అనిల్, తుమ్మ రమేశ్, పాశం అశోక్, జడల వెంకటేశ్వర్, నాయబ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కాసిపేట: మండలంలోని గట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీ సాలేగూడం గ్రామంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బుధవారం కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్ గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. స్థానిక ఆదివాసీల అవసరాల కోసం కంపెనీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి అప్పగించినట్లు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, ఏజీఎం ఉమాశంకర్, మాజీ సర్పంచ్ పేంద్రం రాజు, గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఖాళీలు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షులు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, మహిపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ఉన్న వారిపైనే పనిభారం పడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎంవీ డ్రైవర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓసీపీ, డిపార్టుమెంట్లు, హాస్పిటల్స్‌లో వినియోగించే చాలా వాహనాలు సర్వే ఆఫ్ ఐనందునా, కొత్త వాహనాలు సమకూర్చాలన్నారు. ఆటో గ్యారేజీల్లో స్పేర్స్ కొరత ఉందని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. అన్ని గనులు, డిపార్టుమెంట్‌ల వద్ద రెస్ట్‌హాల్స్ నిర్మించాలన్నారు. ఈ సమస్యలపై యాజమాన్యం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులందరికీ గత ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన లాభాల్లో రూ.5వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్, జాఫర్, నాయకులు మల్లేష్, రాజేశ్వరి, రంజిత్ తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: అధికారులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు స్టడీ మెటీరియల్స్‌ను సమకూర్చగా బుధవారం జీఎం చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. విద్యార్థులు బాగా చదివి, మంచి ర్యాంకులు సాధించి సింగరేణి సంస్థకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా స్పందించి తనవంతుగా విద్యార్థుల స్టడీ మెటీరియల్‌కు రూ.5000 అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, అధికారులు రాజేశ్వర్, రాజేష్, రాజేశ్వరరావు, దేవేందర్ రెడ్డి, కాంతారావు, ప్రధానోపాధ్యాయులు సంతోష్, రాధాకృష్ణ, పీఈటీ హేమ పాల్గొన్నారు.


విద్యార్థులతో జీఎం సంజీవరెడ్డి, అధికారులు

నూతన గనులు ఏర్పాటు చేయాలి

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలో నూతన గనుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆర్కే ఓసీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరైన ప్రణాళిక లేని కారణంగా ఆర్కే ఓసీ మూసివేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ఆర్కే మెగా ఓసీతో పాటు కేకే6, శ్రావణ్‌పల్లి ఓసీలను వెంటనే ప్రారంభించేలా యాజమాన్యం చొరవ తీసుకోవాలని, లేనిక్రమంలో ఏరియా మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. నాయకులు వెల్ది సుదర్శన్, రామస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలోని భూగర్భంలో పనిచేస్తున్న ఓవర్‌మెన్, హెడ్ ఓవర్‌మెన్‌లకు సర్ఫేస్‌లో బదిలీ కోసం వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్ వీటీసీలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 71మంది వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాగా, ఇందులో 42మంది వెబ్ ఆప్షన్స్ పెట్టుకొని బదిలీ పొందారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, వీటీసీ మేనేజర్ వెంకటరామారావు, డెప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతి ప్రసాద్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని జాఫర్‌నగర్‌కు చెందిన తొటం వీరజ్ కరీంనగర్‌లోని శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీలో చదువుతూ ఈ నెల 2వ తేదీన 48మందితో కలిసి హిమాలయ పర్వతాన్ని మూడు రోజుల పాటు 4,250మీటర్లు ఎక్కినందుకు గాను ఆయన్ను మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతి ప్రసాద్ సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థితో పాటు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అభినందించి, మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మసూద్ అలీ, వార్డు కౌన్సిలర్ పోరెడ్డి రాజు, నాయకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

జన్నారం: డీఎస్సీ ద్వారా ఎంపికై నియామకపత్రాలు అందుకున్న నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. జన్నారంలో మొత్తం 21మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇందులో 17మంది ఎస్‌జీటీలు ఎంఈవో విజయ్‌కుమార్‌కు రిపోర్టు చేయగా, నలుగురు స్కూల్ అసిస్టెంట్‌లు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యారు.

భీమారం: మండలంలో మొత్తం 12టీచర్ల పోస్టులు ఖాళీగా ఉండగా, ముగ్గురు ఉపాధ్యాయులను అధికారులు కేటాయించినట్లు ఎంఈవో సురేష్ తెలిపారు. బుధవారం విధులు స్వీకరించినట్లు తెలిపారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలానికి ఇద్దరు స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)లను కేటాయించారు. ఎస్ఏ మ్యాథ్స్ జి.మోహన్ పడ్తనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, తెలుగు పండిత్ పుల్లా అన్వేశ్‌గౌడ్ ర్యాలీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.


జన్నారం: రిపోర్టు చేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లు

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లో నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. కన్నెపల్లి మండలంలో 22మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, భీమిని మండలంలో 13మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లు జాయిన్ అయ్యారు.

క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడ సమాఖ్య మంచిర్యాల ఆధ్వర్యంలో ఈ నెల 18న స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-17 బాలబాలికల క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సీహెచ్.ఫణిరాజా తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు మాత్రమే అవకాశం ఉంటుందని, వివరాలకు క్రికెట్ కోచ్ ప్రదీప్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

అభివృద్ధి పనులకు భూమిపూజ

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత భూమిపూజ చేశారు.

'పది నాణేలపై అనుమానాలు వద్దు'

జన్నారం: రూ.పది నాణేల చెల్లుబాటుపై అనుమాన పడొద్దని యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకట్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం కూరగాయల మార్కెట్లో అవగాహన కల్పించారు.

దీక్షల విరమణకు ఏర్పాట్లు పూర్తి

కాసిపేట: మండలంలోని కల్వరి మినిస్ట్రీస్‌లో గురువారం నిర్వహించనున్న ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఏటా ఫాస్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో 50రోజులు ఉపవాస దీక్షలు చేసి, దీక్ష విరమణకు కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన సుమారు లక్ష మందికి పైగా క్రైస్తవులు హాజరై ప్రార్థనలు చేయనున్నారు.

తహసీల్దార్‌కు వినతి

వేమనపల్లి: వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు బుధవారం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.

నియామకం

భీమారం: మండలంలోని బూర్గుపల్లి లైన్‌మెన్‌గా రామస్వామి, భీమారం లైన్‌మెన్‌గా కోటేష్‌లను కేటాయించగా ఇద్దరు విధుల్లో చేరినట్లు ఏఈ శంకర్ తెలిపారు.

ఆర్థికసాయం

జన్నారం: రోటిగూడకి చెందిన సేపూరి భూమారెడ్డి కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుందని తెలుసుకున్న సామాజిక సంక్షేమ కమిటీ వాట్సప్ గ్రూపు సభ్యులు రూ.20వేలు, అందమైన పల్లెటూరు వాట్సప్ గ్రూపు సభ్యులు రూ.54వేలు పోగు చేసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రయాణికులకు అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఐబీ చౌరస్తాలో బస్‌షెల్టర్ వద్ద ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం

దండేపల్లి: మండల కేంద్రంలో లైన్‌మెన్‌గా పనిచేసిన రామస్వామి, జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేసిన రాజలింగు బదిలీపై వెళ్తుండగా గ్రామస్తులు వారిని సన్మానించారు.